క్లుప్తంగా

నేడు సోలార్‌పై అవగాహన సదస్సు

నేలకొండపల్లి: సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుతో ప్రయోజనాలను వివరించేందుకు గురువారం సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏఈ కె.రామారావు తెలిపారు. నేలకొండపల్లి జీపీని ఆదర్శ సోలార్ గ్రామంగా ఎంపిక చేసిన నేపథ్యాన రెడ్‌కో అధికారులు పాల్గొని అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఉదయం 9గంటలకు గ్రామపంచాయతీ కార్యాలయంలో సదస్సు ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు.

బహిరంగ సభకు తరలిన కాంగ్రెస్ నాయకులు

కామేపల్లి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన నిర్వహించిన బహిరంగ సభకు మండల కాంగ్రెస్ నాయకులు, మహిళలు భారీగా తరలివెళ్లారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గింజల నర్సింహారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ధనియాకుల హన్మంతరావు, నల్లమోతు లక్ష్మయ్య, గుజ్జర్లపూడి రాంబాబు, కొమ్మినేని శ్రీనివాసరావు, ఇట్టా శ్రీను, చల్లా హరి, కొరివిలు, మేకపోతుల సాయన్న, దూగుంట్ల వీరన్న, ఐతనబోయిన నాగేశ్వరరావు, బానోత్ శంకర్, సురభి వీరన్న, పవన్ తదితరులు తరలివెళ్లారు.

సాగు వివరాలు నమోదు చేసుకోవాలి



కొమ్మినేపల్లిలో పత్తి సాగు వివరాలు నమోదు చేస్తున్న వ్యవసాయాధికారులు

కామేపల్లి: ఖరీఫ్ సీజన్‌లో రైతులు తాము సాగు చేసిన అన్ని రకాల పంటల వివరాలను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి భూక్యా తారాదేవి అన్నారు. బుధవారం మండలంలోని కొమ్మినేపల్లి జీపీలో పంటల సాగు వివరాల నమోదును పరిశీలించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. పంట నమోదు ఆధారంగానే పంటల కొనుగోలు, రైతులకు పంట నష్ట పరిహారం చెల్లించేందుకు వీలుంటుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏఈఓ భాస్కర్, జగదీశ్వర్, రైతులు పాల్గొన్నారు.

ఆత్మీయ భరోసా అమలు చేయండి

తిరుమలాయపాలెం: రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆత్మీయ భరోసా పథకాన్ని వెంటనే అమలు చేయాలని కోరుతూ బుధవారం ఏఐకేఎంఎస్ ఆధ్వర్యాన పిండిప్రోలు, తిమ్మక్కపేట, దమ్మాయిగూడెం పంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రాలు అందజేశారు. వ్యవసాయ కూలీలకు ఆత్మీయ భరోసా కింద సంవత్సరానికి రూ.12వేలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం(ఏఐపీకేఎంఎస్) జిల్లా అధ్యక్షులు రేపాకుల శివలింగం, తిమ్మిడి హనుమంతరావు, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, చిరంజీవి, వెంకటస్వామి, వెంకయ్య, నరేష్, వెంకన్న, సైదయ్య పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత తప్పనిసరి

నేలకొండపల్లి: ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాల్సిందేనని ఎంపీడీఓ ఎం.యర్రయ్య సూచించారు. మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశుభ్ర వాతావరణంలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి బి.చలపతిరావు, పాఠశాల హెచ్‌ఎం, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో దివ్యాంగులకు అవకాశం కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ చలమయ్య

నేలకొండపల్లి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీల నాయకులు దివ్యాంగులకు అవకాశం కల్పించాలని టీడీజేఏసీ చైర్మన్ పీ.వీ.చలమయ్య కోరారు. మండలంలోని చెన్నారంలో బుధవారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ పంచాయతీలో వార్డులను దివ్యాంగులకు ఏకగ్రీవం చేయాలని, నాలుగు గ్రామ పంచాయతీలను దివ్యాంగులకు సర్పంచ్ అభ్యర్థులుగా ప్రకటించాలని కోరారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఈసారి ఎన్నికల బరిలో నిలవాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు రామకృష్ణ, భాస్కర్‌రావు, నాగరాజు, రామారావు, లక్ష్మి, వెంకన్న, పుల్లయ్య, నాగలక్ష్మి, రేణుక, వెంకటమ్మ, నాగేశ్వరరావు, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.



చిన్న డ్రెయినేజీలో ప్రవహిస్తున్న వర్షపు నీరు



మామిళ్లగూడెంలో రోడ్డుపై నీరు నిలిచి ఇలా..

ఏటా అవస్థలే..

కాల్వకట్ట ప్రాంతంలో డ్రెయినేజీ సమస్య

- కాల్వ పొంగి ఇళ్లలోకి చేరుతున్న నీరు
- మూడు దశాబ్దాల క్రితం నిర్మించడంతో కష్టాలు
- మామిళ్లగూడెం రైల్వే పట్టాల వరకూ ముంపే
- పట్టించుకోని అధికారులు



డ్రెయినేజీ మధ్యలో పెరిగిన పిచ్చిచెట్లు

ఖమ్మం రాపర్తినగర్: ఇళ్ల మధ్యలో నుంచి డ్రెయినేజీ ఉండడంతో ఏటా కురుస్తున్న వర్షలకు మార్కెట్ రోడ్డులోని కాల్వకట్టకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని దాదాపు మూడు దశాబ్దాల క్రితానికి పైగా నిర్మించారు. అప్పట్లో ఈ ప్రాంతంలో ప్రజలు ఎక్కువగా లేకపోవడంతో బుర్హాన్‌పురం నుంచి డీఆర్‌డీఏ కార్యాలయం మీదుగా కూరగాయల మార్కెట్ నుంచి కాల్వకట్ట ఇళ్ల మధ్య నుంచి ఏర్పాటు చేశారు. దీంతో ప్రస్తుతం ఏటా వర్షం పడినప్పుడల్లా ఆప్రాంత ప్రజలతో పాటు మామిళ్లగూడెం ప్రధాన రోడ్లను కలుపుతూ రైల్వే పట్టాల దాక నీరు వెళ్తోంది. దీంతో ఈ మార్గంలో ఉన్న వందలాది ఇళ్లు నీట మునుగుతున్నాయి.

చెరువును తలపించేలా..

గతేడాది కురిసిన వర్షాల వల్ల మామిళ్లగూడెంలోని ఇళ్లు పూర్తిగా నీట మునిగాయి. ఈవిషయం తెలిసిన మున్సిపల్ శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వర్షం వస్తే ప్రధానంగా కూరగాయల మార్కెట్ రోడ్డు, కాల్వకట్ట మామిళ్లగూడెం ప్రాంతవాసులు భీతిల్లుతున్నారు. గతేడాది కురిసిన వర్షాల వల్ల డ్రెయినేజీ నీరు వెళ్లే ప్రాంతవాసుల ఇళ్లల్లోకి నీరురావడమే కాక ఆప్రాంతమంత చెరువులా తయారైంది. దీంతో రాకపోకలు బంద్ కావడమే కాక ఇంట్లో ఉన్న సామాన్లు, టీ.వీలు, ఫ్రిజ్‌లు, కూలర్లు పూర్తిగా పాడయ్యాయని ఆప్రాంత వాసులు వాపోయారు.

ఏటా నష్టాలే..

నగరంలోని 50వ, 49వ డివిజన్ల ప్రజలకు ఈ డ్రెయినేజీతో ఏటా తీవ్ర నష్టం జరుగుతుందని ఆ ప్రాంతవాసులు ఆవేదన చెందుతున్నారు. ఎప్పుడో నిర్మించిన ఈ డ్రెయినేజీని సంబంధిత శాఖ అధికారులు ఇంతవరకు కనీసం చూసిన దాఖలాలు లేవని దుయ్యబడుతున్నారు. డీఆర్‌డీఏ, మార్కెట్ కింద నుంచి వచ్చే డ్రెయినేజీని తొలగించి.. పెద్ద డ్రెయినేజీని నిర్మిస్తే వర్షం నీరు వచ్చిన తమకు ఎలాంటి భయం ఉండదని, దీనిపై ఖమ్మం మున్సిపల్ శాఖ ప్రత్యేక చొరవ చూపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఇంట్లోకి నీరు వస్తోంది..



ఏ చిన్న వర్షం పడినా ఇంట్లోకి నీరు వస్తుంది. వర్షాలు పడినప్పుడు అధికారులు రావడం.. సమస్యను పరిష్కరిస్తామని చెప్పడం వెళ్లిపోవడం ఇదే జరుగుతోంది. గతేడాది మా ఇంట్లో 5 అడుగుల మేర వరద నీరు వచ్చి ఇంట్లో సామాన్లు పనికిరాకుండాపోయాయి. దీర్ఘకాలికంగా ఉన్న సమస్యను వెంటనే మున్సిపల్ శాఖ పరిష్కరిస్తే బాగుంటుంది.

– ఎం.రంగారావు, మామిళ్లగూడెం

కొత్త డ్రెయినేజీ నిర్మించాలి



ఎప్పుడో నిర్మించిన డ్రెయినేజీని తొలగించి కొత్తది నిర్మిస్తే బాగుంటుంది. ఏటా ఈ ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం కాని పరిష్కారం లభించడంలేదు. ఇప్పటికైనా నూతన బస్టాండ్ ప్రాంతం నుంచి కొత్త డ్రెయినేజీ నిర్మించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఎ.ఉపేందర్, కాల్వకట్ట ప్రాంతం





వసతి గృహం ఆవరణలో నిలిచిన వర్షపునీరు

కుంటను తలపిస్తున్న 'హాస్టల్' ఆవరణ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలోని ఎస్సీ సంక్షేమ శాఖకు చెందిన బాలుర వసతిగృహం ఆవరణ వర్షపు నీటితో నిండి చిన్నపాటి కుంటను తలపిస్తోంది. ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల సమీపాన బాలుర వసతిగృహం (ఏ) ఉండడంతో ఇటీవల వర్షాలతో కాలేజీ మైదానం నుంచి వరద బయటకు వెళ్లే దారి లేక హాస్టల్ ప్రాంగణంలోకి చేరుతోంది. వసతిగృహం ఉన్న ప్రాంతం లోతట్టు కావడంతో హాస్టల్ ఆవరణ జలమయమైంది. అయితే, ఈ సమస్య రెండేళ్లుగా తలెత్తుతుండగా నీటి తొలగింపునకు మోటార్లు ఉపయోగించినా మైదానం నుంచినిరంతరాయంగా నీరు ఊట వేయడం వల్ల ఈ ప్రయత్నాలు ఫలితం ఇవ్వడం లేదు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లేక ఏటా వర్షాకాలంలోనూ విద్యార్థులు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈక్రమంలో విద్యార్థులను తాత్కాలికంగా దగ్గరలోని ఎస్సీ కళాశాల బాలుర 'ఏ'వసతిగృహానికి తరలించారు. అయితే, సమస్యకు శాశ్వత పరిష్కారంగా ఆవరణలో మట్టి పోసి ఎత్తు పెంచాలని, కళాశాల మైదానం నుంచి నీరు బయటకు వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై ఎస్సీ బాలుర 'ఏ'వసతిగృహం సంక్షేమాధికారి మల్లారెడ్డి మాట్లాడుతూ ఆవరణలోకి నీరు రాకుండా, మైదానంలో నీరు బయటకు వెళ్లేలా కాల్వ తవ్వితే ఫలితం ఉంటుందని తెలిపారు. అలాగే, హాస్టల్ ఆవరణలో మట్టిని నింపాల్సిన అవసరముందని పేర్కొన్నారు.



బయటకు వస్తున్న మురుగు నీరు



అధ్వానంగా ఆస్పత్రి పరిసరాలు

'అండర్ గ్రౌండ్' ఆగమాగం..

ఖమ్మంవైద్యవిభాగం: పెద్దాస్పత్రిలో పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా వేధిస్తోంది. తరచూ అంతర్గత పైప్‌లైన్ల నుంచి మురుగు నీరు బయటకు వస్తుండడంతో పరిసరాలు అధ్వానంగా తయారవుతున్నాయి. అంతేకాక మురుగు నీరు రోజుల తరబడి నిల్వ ఉండడంతో పరిసరాలు కంపుకొడుతూ, దోమలకూ ఆవాసాలుగా మారాయి. అసలే సీజనల్ వ్యాధుల కాలం కావడంతో అండర్‌గ్రౌండ్ తూముల నుంచి మురుగు నీరు లీకై ఆస్పత్రి నడి మధ్యలో ఉన్న ఖాళీ స్థలాల్లో చేరడంతో లేనిపోని రోగాలను కొనితెచ్చుకుంటున్నారు. నిత్యం వేలాది మంది వచ్చి వెళ్లే ఆస్పత్రిలో ఈ దుస్థితి ఏంటాని పేషంట్లు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా పైపులైన్ వ్యవస్థను సరిచేసి మురుగునీరు నిల్వ లేకుండా చేయాలని పేషంట్లు డిమాండ్ చేస్తున్నారు.

ప్రజా సమస్యలపై పట్టింపు కరువు



టేకులపల్లిలో ఆరా తీస్తున్న సీపీఎం నాయకులు

ఖమ్మంఅర్బన్: మురికికూపంగా మారిన నగరంలోని 7వ డివిజన్‌పై పాలకుల పట్టింపు కరువైందని సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, హవేలీ మండల కార్యదర్శి దొంగల తిరుపతి విమర్శించారు. స్థానిక కార్పొరేటర్ పట్టించుకోకపోవడం, అధికారులు నిర్లక్ష్యంతోనే ఖానాపురం హవేలీ, టేకులపల్లి, లక్ష్మీనగరం, శ్రీకృష్ణనగర్ ప్రాంతాలు మురికివాడలుగా మారాయన్నారు. బుధవారం డివిజన్‌లో నెలకొన్న సమస్యలపై సీపీఎం ఆధ్వర్యాన సర్వే చేపట్టగా.. స్థానికులు డివిజన్‌లో నెలకొన్న పలు సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ఆరు నెలల క్రితం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రూ.40 లక్షల నిధులతో శంకుస్థాపన చేసిన డ్రెయినేజీ పనులు ఇంతవరకు పూర్తి కాలేదని, దీంతో ప్రజలు మురికి కూపంలో జీవించాల్సి వస్తోందన్నారు. గోపాలపురం పవర్‌గ్రిడ్ తొలగించినప్పటికీ కరెంట్ స్తంభాలు, వైర్లు తొలగించకపోవడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతుందని, కేసీఆర్ డబుల్ బెడ్రూమ్ గృహాల నుంచి వచ్చే మురుగు నీరు శ్రీకృష్ణనగర్, లక్ష్మీనగర్‌లలో ఆగిపోతున్నాయని, పశువుల ఆస్పత్రి ప్రారంభించినప్పటికీ డాక్టర్లు, సిబ్బంది లేరని మండిపడ్డారు. సమస్యలు పరిష్కరించకుండా ప్రజలకు నోటీసులు పంపడం ఏంటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పిన్నింటి రమ్య, నాయకులు పోతురాజు వెంకటి, చిలకల వెంకటేశ్వర్లు, ధనియాకుల నాగేశ్వరరావు, పెద్ది నాగయ్య, గాలి అంజయ్య, పందుల నాగమణి, వేదగిరి మురహరి, కుర్రి రామారావు, రేగళ్ల ఆదినారాయణ, పి.వెంకటరెడ్డి, చిత్తారు వెంకటేశ్వర్లు, దొంతెనబోయిన వినోద్, పెండ్ర గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీకి సబ్‌సెంటర్లు

రఘునాథపాలెం: రైతులు పని మానుకుని సుదూర ప్రాంతాల నుంచి సహకార సంఘాల కార్యాలయాలకు వచ్చి యూరియా కోసం వేచి ఉండకుండా అధికారులు చర్యలు చేపట్టారు. పీఏసీఎస్‌లకు దూరంగా ఉన్న గ్రామాల్లోనే సబ్‌సెంటర్ల ద్వారా యూరియా పంపిణీ చేయాలని నిర్ణయించారు. రఘునాథపాలెం మండలంలోని మంచుకొండ పీఏసీఎస్ పరిధి ఈర్లపూడి, చిమ్మపూడి, వీ.వీ.పాలెం సొసైటీ పరిధి అల్లిపురం, దారేడు పరిధి కైకొండాయిగూడెం లేదా రామన్నపేటలో సబ్‌సెంటర్ ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నారు. ఒకటి, రెండు రోజుల్లో సబ్ సెంటర్లకు సైతం యూరియా కేటాయించనున్నట్లు తెలుస్తుండగా అనువైన స్థలాల గుర్తింపులో నిమగ్నమయ్యారు.

ఓరియంటేషన్ ప్రోగ్రామ్..

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం ఓరియంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ బానోత్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులకు, రిక్రూటర్స్‌కు ఒక సారధిలా ఈ ఓరియంటేషన్ ప్రోగ్రామ్ శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని పేర్కొంటూ టాస్క్ ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ వి.రామారావు, టాస్క్ కోఆర్డినేటర్ దినేష్, టీఎస్‌కేసీ మెంటర్ సీహెచ్.కవిత పాల్గొన్నారు.

లంబాడీలపై అశ్రద్ధ వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న హరినాయక్

ఖమ్మం మామిళ్లగూడెం: లంబాడీలు ఎస్టీలు కాదంటూ కోర్టులో వేసిన పిటిషన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని బంజారా అడ్వకేట్ జేఏసీ నాయకుడు హరినాయక్ డిమాండ్ చేశారు. బుధవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి భద్రాద్రి జిల్లా పర్యటన సందర్భంగా లంబాడీల నాయకులను, యువతను అరెస్టు చేశారని వెంటనే బేషరతా వారిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. తెల్లం వెంకట్రావ్, సోయం బాబూరావు కోర్టులో వేసిన పిటిషన్‌ను ఉపసంహరించుకునేలా చేస్తానని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య చెప్పారని, లంబాడీలను అశ్రద్ధ చేస్తే తగిన మూల్యం తప్పదన్నారు. ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల్లో పాలేరు నుంచి మొదలు బస్‌యాత్ర ప్రారంభిస్తామని చెప్పారు. ఏజెన్సీ ఏరియాలో ఉద్యోగాలు కల్పించిన జీఓ 3ను కొట్టివేసినప్పుడు ఆదివాసీ ఎమ్మెల్యే ఎవరూ నోరుమెదపలేదన్నారు. వెంటనే కోర్టులో వేసిన పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ధరావత్ వీరన్న, దేవేందర్, శ్రీకాంత్, బానోత్ తులసీ బాయి, చందావత్ నరేంద్ర నాయక్, ధరావత్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

అఖిలపక్షం ఆధ్వర్యాన ఆందోళన



దీక్షలో పాల్గొన్న అఖిలపక్షం నాయకులు

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం తిరుమలాయపాలెంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అఖిలపక్షం ఆధ్వర్యాన రిలే నిరాహార దీక్ష చేపట్టారు. మండల కేంద్రంలోని సర్వే నంబర్ 254లో ఉన్న ప్రభుత్వ భూమిలో ఐటీఐ కళాశాల నిర్మించాలని, మాతా శిశు కేంద్రం, బస్టాండ్ ఏర్పాటు చేయాలని అఖిల పక్షం నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూమిలో బోర్డు ఏర్పాటు చేసి, హద్దులు పాతలేదని, ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఐటీఐ కళాశాల నిర్మిస్తామని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చి నెరవేర్చకపోవడంతో దీక్ష చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు కొమ్ము శ్రీను, ఎన్నబోయిన రమేష్, నామ ప్రసాద్, గంట కృష్ణ, చింతిరాల నాగభూషణంస్వామి, కొమ్ము పుల్లయ్య, గుగ్గిల అశోక్, ఆర్మీ రవి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన..



మాట్లాడుతున్న డీఎస్పీ ఫణీంధర్

ఖమ్మం సహకారనగర్: నగరంలోని పలు ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో సైబర్ జాగృక్త దివస్ కార్యక్రమంలో భాగంగా బుధవారం సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. నగరంలోని కవిత డిగ్రీ కళాశాలలో, ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సైబర్ క్రైం డీఎస్పీ సీహెచ్‌ఆర్‌వీ ఫణీంధర్ పలు సూచనలు చేశారు. ఆర్‌టీఏ చలానా, ఫేక్ ప్రొఫైల్ స్కామ్, పీఎం కిసాన్ యోజన, ఫేక్ కస్టమర్ కేర్ సర్వీసెస్, ఏపీకే ఫ్రాడ్ తదితర నకిలీ అప్లికేషన్లు, లింకులు వంటివి ఓపెన్ చేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు ఎ.రంజిత్‌కుమార్, విజయ్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ ఎం.ప్రసాద్, కానిస్టేబుళ్లు నాగేశ్వరరావు, సుప్రియ, ప్రియదర్శిని ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ గోపాల్, కవిత డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ రోజారాణి తదితరులు పాల్గొన్నారు.

● 'వంతెన'కు విద్యుత్ శోభ..



ప్రకాష్‌నగర్ వంతెనపై విద్యుత్ కాంతులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని ప్రకాష్‌నగర్ వద్ద ఉన్న మున్నేరు నది వంతెనపై నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు బుధవారం రాత్రి నుంచి వెలుగులు విరజిమ్ముతున్నాయి. ఈ వంతెన ఖమ్మం నగరం నుంచి వెంకటగిరి క్రాస్, కోదాడ క్రాస్, నేషనల్ హైవే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అనుసంధానంగా ఉండడంతో నిత్యం రాకపోకల దృష్ట్యా ఖమ్మం మున్సిపల్ శాఖ ఆధ్వర్యాన ఏర్పాటు చేశారు. దీంతో పాటు గతేడాది వరద ఉధృతి, వ్యవసా య మార్కెట్‌కు పంట ఉత్పత్తులు విక్రయానికి వస్తుండడంతో విద్యుత్ దీపాల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇవ్వడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పూజలు.. అన్నదానాలు..

వినాయక చవితి నవరాత్రోత్సవాల్లో భాగంగా బుధవారం గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యాన పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేయగా పలువురు దంపతులు పాల్గొని పూజలు చేశారు. అనంతరం కులమతాలకు అతీతంగా అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంగాంధీచౌక్: పద్మావతినగర్‌లో సాయి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణపతికి పల్లకీ సేవ



ఖమ్మంఅర్బన్: ఇందిరానగర్ బాలగణపతి దేవాలయంలో భక్తుల పూజలు



ఖమ్మం మామిళ్లగూడెం: అన్నదానం చేస్తున్న కార్పొరేటర్ గోవిందమ్మ-రామారావు దంపతులు



ఖమ్మంగాంధీచౌక్: బొమ్మన సెంటర్‌లో.. స్తంభాద్రి ఉత్సవ సమితి ప్రతినిధులు



ఖమ్మంమయూరిసెంటర్: సరితా క్లినిక్ సెంటర్‌లో అన్నదానం చేస్తున్న సీపీఎం నాయకులు



నేలకొండపల్లిలో..

నిమజ్జన ఘాట్‌ల పరిశీలన



ఘాట్ వద్ద మేయర్ నీరజ, తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: నిమజ్జన ఘాట్ పనులను సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలని మేయర్ పునుకొల్లు నీరజ అధికారులకు సూచించారు. బుధవారం ఆమె నిమజ్జన ఘాట్‌లను పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. అధికారులు, సిబ్బందితో పనుల పురోగతిని అడిగి తెలుసుకుని పనులు త్వరగా పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఏసీపీ శ్రీనివాసులు, మున్సిపల్ అధికారులు కృష్ణలాల్, శ్రీనివాస్, స్తంభాద్రి ఉత్సవ కమిటీ కన్వీనర్ కన్నం ప్రసన్న కృష్ణ, నాలం సతీష్, జాకీర్, గజ్జల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

బుక్కైపోతారు జాగ్రత్త..!



తిరుమలాయపాలెంలో స్పీడ్‌గన్‌తో వాహన వేగాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

అతివేగంతో రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోకుండా వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు పోలీసులు తిరుమలాయపాలెంలో స్పీడ్‌గన్స్ ఏర్పాటు చేశారు. సీపీ సునీల్‌దత్ ఆదేశాల మేరకు ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి సారథ్యాన పాలేరు నియోజకవర్గంలోని అన్ని మండలాలతో పాటు ముదిగొండ మండలంలోని రహదారులపై వీటిని ఏర్పాటు చేశారు. ఇందుకు ఉమెన్ పోలీస్ ఆఫీసర్లకు శిక్షణ కూడా ఇచ్చారు. ఇకనుంచి వాహనాల అతివేగాన్ని కంట్రోల్ చేయొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

– తిరుమలాయపాలెం